భక్తులకు మెరుగైన వైద్యం అందించాలి

ఆత్మకూరు/వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 13 : అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతరకు వస్తున్న భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో అప్పయ్య అన్నారు. గురువారం జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. డాక్టర్ నర్సింగరావు పాల్గొన్నారు. మాతా, శిశు మరణాలను నివారించాలని ఆయన అన్నారు. జిల్లా కార్యాలయంలో జాతీయ ఆరోగ్య మిషన్, అర్మాన్ స్వచ్ఛంద సంస్థ ఆ ధ్వర్యంలో జిల్లాలోని 12ఆరోగ్య కేంద్రాల కార్యకర్తలకు అవగాహన కల్పిం చారు. సంతోషి, సౌజన్య, శివకుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మండలం చేయాలని రోడ్డుపై టిఫిన్ చేస్తూ ధర్నా

కమలాపూర్, ఫిబ్రవరి 13 : ఉప్పల్ మేజర్ జీపీని నూతన మండలంగా ప్రకటించాలని పరకాల-హుజూరాబాద్ రహదారిపై బైఠాయించి టిఫిన్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ప్రభుత్వం ఇక్కడి ప్రజల చిరకాల ఆకాంక్షను గుర్తించి మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు.

మల్లారెడ్డిని తొలగించే వరకు ఉద్యమిస్తాం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 13 : కేయూ ఓఎస్డీ మల్లారెడ్డిని వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని కేయూ విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కేయూలో జరిగిన సమావేశంలో విద్యార్థి సంఘ నేతలు కొలకట్ల సుమన్, బోస్క నాగరాజ్ మాట్లాడుతూ.. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికే పదవులు కట్టబెట్టడంలో ఆంతర్యమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించిన విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టిన చరిత్ర మల్లారెడ్డిది అని అన్నారు. మట్టెడ కుమార్, ఎంఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జి వడ్డేపల్లి మధు, లంక రాజగోపాల్ రెడ్డి, ఎస్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ పాల్గొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

కమలాపూర్, ఫిబ్రవరి 13 : మండలంలోని గుండేడు గ్రామానికి చెందిన సిలువేరు కేతమ్మ (55)ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ హరికృష్ణ గురువారం తెలిపారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకొన్నదని చెప్పారు. భర్త ఐలు కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కమలాపూర్ : శనిగరం గ్రామంలో పీడీఎస్ బియ్యం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు సీఐ హరికృష్ణ గురువారం తెలిపారు. గ్రామంలోని బండ శ్రీనివాస్ ఇంట్లో తనిఖీ చేయగా 17 క్వింటాళ్ల బియ్యం పట్టుబడినట్లు చెప్పారు.

కాకతీయ యూనివర్సిటీకి పేటెంట్

హనుమకొండ చౌరస్తా, ఫి బ్రవరి 13 : మేధో సంపత్తి హక్కుల(ఐపీఆర్)లో భాగంగా కాకతీయ యూనివర్సిటీ ఐపీఆర్ సెల్ నుంచి ఫార్మసీ అధ్యాపకుడు ప్రసాద్, ఫార్మసీ విభాగ పరిశోధకురాలు దుర్గ సారథ్యంలో 'ఏ కో క్రైస్టల్ టు ఇంప్రీజ్ ది బయో అవైలబులిటీ ఆఫ్ కుర్కుమిన్ అండ్ ది ప్రిపరేషన్ మెథడ్ దేరాఫ్' అనే అంశంపై పేటెంట్ పొందినట్లు, న్యూఢిల్లీ కంట్రోల్ ఆఫ్ పేటెంట్స్ ఆఫీస్ నుంచి సర్టిఫికెట్ అందినట్లు కేయూ ఐపీఆర్ సెల్ సంచాలకుడు ప్రసాద్ తెలిపారు. భవిష్యత్‌లో ఈ పేటెంట్ కేయూకే దక్కుతుందని, ఆచార్య ప్రసాద్, దుర్గాను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం అభినందించారు.

సర్టిఫికెట్ అందజేస్తున్న వీసీ

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, ఫిబ్రవరి 13 : జిల్లాలో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు రెండు బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయడంతో పాటు ప్రతి రూట్‌లో రెండు బస్సులు ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ర్యాలీలు, సభలను వీడియో చిత్రీకరణ చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో రాథోడ్ రమేశ్, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేశ్‌బాబు, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, డీపీవో లక్ష్మీ రమాకాంత్ పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా వ్యవహరించాలి : అడిషనల్ కలెక్టర్..

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో పీవోలు, ఏపీవోలు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో ఎన్నికల విధుల నిర్వహణపై పీవో, ఏపీవోలకు నిర్వహించిన మొదటి విడుత శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. మాస్టర్ ట్రైనర్లు భాస్కర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, రవి వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సీపీవో సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల జాబితా అందజేత..

రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పోలింగ్ కేంద్రాల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జడ్పీ సీఈవో విద్యాలత అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభ్యంతరాలు తెలపాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఈవీ శ్రీనివాసరావు, నేహాల్, బీఆర్ఎస్ నుంచి ప్రవీణ్ కుమార్, బీజేపీ నుంచి నిశాంత్, వైసీపీ నుంచి రజినీకాంత్, టీడీపీ నుంచి లక్ష్మణ్ పాల్గొన్నారు.

నోడల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

సహకారం.. సందిగ్ధం

- నేటితో ముగియనున్న పాలకవర్గం గడువు
- ప్రభుత్వం నుంచి రాని స్పష్టత

హనుమకొండ, ఫిబ్రవరి 13 : రైతులకు అండదండగా నిలిచే పీఏసీఎస్‌ల గడువుపై సందిగ్ధం నెలకొంది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో పాలకవర్గంలో అయోమయం నెలకొంది. పాలకవర్గ కాలపరిమితి ఈ నెల 14వ తేదీతో ముగియనుండడంతో గడువును మరికొన్ని నెలలు పొడిగిస్తారా? లేక పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగిస్తారా? అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. శుక్రవారం సాయంత్రంలోగా ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తప్పకుండా తీసుకోవాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్ చైర్మన్లను పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి జిల్లాలో 16 పీఏసీఎస్ సంఘాలు ఉండగా ఒక్కో సంఘంలో 13 మంది సభ్యులు ఉన్నారు. ఇదే విషయంపై ఇన్‌చార్జి డీసీవో కొండ రాములును ఫోన్‌లో సంప్రదించగా పీఏసీఎస్ పాలకవర్గాల గడువు విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని తెలిపారు.

మూతపడ్డ స్టోన్ క్రషర్లు

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో ప్రజలకు ఇబ్బందులు

నయీంనగర్, ఫిబ్రవరి 13 : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్టోన్ క్రషర్ల యాజమానులు సమ్మెబాట పట్టారు. ఈ నెల 12వ తేదీ నుంచి మూతపడడంతో ఇళ్లు కట్టుకునే వారికి ముఖ్యంగా సామాన్య ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నెల క్రితం క్రషర్ యజమానులు రాయల్టీ కట్టాలని నోటీస్‌లు రావడంతో ఈ సమస్య తలెత్తినట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 70 క్రషర్లకు పైనే ఉన్నట్లు సమాచారం. అయితే అక్కడ పని చేసే కూలీలు, దానిపైనే ఆధారపడిన వారు రోడ్డున పడ్డారు. అధికారుల వల్లే ఈ సమస్య ఉత్పన్నం అయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పనిదే అధికారుల చేస్తారా? అని పలువురు చర్చించుకుంటున్నారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డుకునేందుకు చెక్ పోస్టులు

కమలాపూర్, ఫిబ్రవరి 13 : మండలంలోని అంబాల, ఉప్పల్ గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా అడ్డుకునేందుకు పోలీసులు గురువారం చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. నిత్యం వందలాది ట్రాక్టర్లతో కరీంనగర్ జిల్లా మానేరు, మండలంలోని మర్రిపెల్లిగూడెం, వంగపల్లి, శనిగరం, గోపాల్‌పూర్, అంబాల వాగుల నుంచి ఇసుక అక్రమంగా హనుమకొండ, వరంగల్ పట్టణాలకు తరలిస్తున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కమలాపూర్/ఎల్కతుర్తి, ఫిబ్రవరి 13 : మండలంలోని అంబాల గ్రామంలో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి, విలాసాగర్ గ్రామ మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు చెప్పారు. డ్రైవర్ పుట్టల కిట్టుపై కేసు నమోదు చేశామన్నారు. ఎల్కతుర్తి మండలంలోని గోపాలపూర్ గ్రామ శివారు నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. కంచర్ల సదానందం, మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

21 నుంచి ఆల్ ఇండియా ఇంటర్ నిట్ టోర్నమెంట్స్

ఆతిథ్యమివ్వనున్న వరంగల్ నిట్

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 13 : వరంగల్ నిట్‌లో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఆలిండియా ఇంటర్ నిట్ టోర్నమెంట్ జరుగనుంది. దేశంలోని 22 నిట్‌ల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొననున్నారు. టోర్నమెంట్ బ్రోచర్‌ను నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి విడుదల చేశారు. శ్రీనివాసాచార్య (డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్), రవికుమార్ (హెడ్ - స్పోర్ట్స్ సెంటర్), డీవీఎస్ఎస్ శివశర్మ (బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ మెంబర్), ప్రశాంత్ (సీనియర్ ఎస్ఏఎస్ ఆఫీసర్), హరి (ఎస్ఏఎస్ ఆఫీసర్) హాజరయ్యారు. ఈ టోర్నమెంట్‌లో 22 నిట్‌ల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నారు. పురుషుల, మహిళల వాలీబాల్, యోగా, హ్యాండ్‌బాల్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

దొంగతనం ఘటనపై కేసు నమోదు

మడికొండ, ఫిబ్రవరి 13 : మడికొండ పోలీస్ స్టేషన్‌లో దొంగతనంపై గురువారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కథనం ప్రకారం.. మడికొండ శివారు వెస్ట్ సిటీలో ఉంటున్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఓరం భూమయ్య తన మామ అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతుండడంతో ఈ నెల 11న తన భార్య తిరుమలాదేవితో కలిసి వెళ్లారు. సాయంత్రం పక్కింటి వాళ్లు ఫోన్ చేసి వారి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని చెప్పడంతో డయల్ 100కు కాల్ చేసి ఇంటికి బయలుదేరారు. ఇంట్లోకి వెళ్లి చూడగా తులం చొప్పున మూడు నల్లపూసల చైన్‌లు, మరో తులం చైన్ అపహరణకు గురైనట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.2లక్షల 10 వేలు ఉంటుందన్నారు. సీసీ కెమెరాను పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి కాంపౌండ్ గోడ దూకి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి తిరిగి వెళ్లినట్టు ఉంది. దీని ఆధారంగా విచారణ చేపడుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

డంపింగ్‌యార్డు పొగ వ్యాపించకుండా చర్యలు

మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

మడికొండ డంపింగ్‌యార్డు పరిశీలన

మడికొండ, ఫిబ్రవరి 13 : డంపింగ్ యార్డు నుంచి పొగతో పాటు దుమ్ము, ధూళి వ్యాపించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. మడికొండ శివారులోని డంపింగ్‌యార్డును గురువారం పరిశీలించారు. ఆమెకు మడికొండ, రాంపూర్ ప్రజలు యార్డు వల్ల ఏర్పడుతున్న సమస్యలను వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డులో అంతర్గత చర్యల వల్ల మంటలు అంటుకుంటే, ఆర్పివేసేందుకు మూడు నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 12ఎకరాల్లో బయో మైనింగ్ పూర్తయినందున అక్కడి నుంచి ఆర్‌డీఎఫ్, ఇతర వ్యర్థాలు త్వరగా తరలించి ఆ భూమిని బల్దియాకు అందజేయాలని సూచించారు. ఈ ప్రాంతంలో యూకలిప్టస్ వంటి మొక్కలు నాటాలని హార్టికల్చర్ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, హెచ్‌వో రమేశ్, సీఎంహెచ్‌వో రాజేశ్, ఈఈలు మహేందర్, సంతోశ్, డీఈ సారంగం, ఏఈలు రామన్న, సంతోశ్ పాల్గొన్నారు

మడికొండ శివారులోని డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

కడియం శ్రీహరిని కలిసిన గ్రామస్తులు..

మడికొండ, రాంపూర్ గ్రామాల ప్రజలు డంపింగ్ యార్డును తొలగించేందుకు కృషి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన బల్దియా కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్కళ్లపల్లి రాంగోపాల్‌రావు, తౌటిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, తాడూరి మోహన్, పొనగోటి వెంకట్‌రావు, దువ్వ నవీన్, బొల్లికొండ వినోద్, వస్కుల నాగరాజు, బిల్ల రవీందర్ ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కమలాపూర్/ఎల్కతుర్తి, ఫిబ్రవరి 13 : మండలంలోని అంబాల గ్రామంలో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి, విలాసాగర్ గ్రామ మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు చెప్పారు. డ్రైవర్ పుట్టల కిట్టుపై కేసు నమోదు చేశామన్నారు. ఎల్కతుర్తి మండలంలోని గోపాలపూర్ గ్రామ శివారు నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. కంచర్ల సదానందం, మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బీసీ జనాభా తగ్గింపు అగ్రకులాల కుట్ర

శాయంపేట, ఫిబ్రవరి 13 : రాష్ట్రంలో బీసీల జనాభాను తగ్గించి చూపడంలో అగ్ర కులాల కుట్ర ఉందని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగరి సాంబయ్య అన్నారు. శాయంపేటలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాహుల్‌గాంధీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీలకు 42 శాతం చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించారని, ఇంతవరకు అమలు చేయలేదన్నారు. 2011లో ఉన్న బీసీ జనాభా సంఖ్యను ఉద్దేశపూర్వకంగా తగ్గించి బీసీల గొంతు కోశారన్నారు. ఇప్పటికైనా వారిని గమనించి బీసీ నాయకులు మేల్కొనాలన్నారు. మండల కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

ముగ్గురు యువకులపై కేసు

ఐనవోలు, ఫిబ్రవరి 13 : మండలంలోని వనమాలకనపర్తిలో గంజాయితో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులపైన పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన జూపాక రాహుల్, రిపిక ప్రమోద్, వల్లపు వంశీ వనమాలకనపర్తి శివారు ఎస్సారెస్పీ కెనాల వద్ద పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 200గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయిని బల్లార్షా నుంచి తెచ్చారని, వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా..

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

న్యూశాయంపేట, ఫిబ్రవరి 13 : నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం రెవెన్యూ, లోటస్, ప్రకాశ్‌రెడ్డి, ఇందిరమ్మ కాలనీల్లో పర్యటించారు. కాలనీల్లో రోడ్లు, సైడ్ డ్రెయిన్లు త్వరలో నిర్మిస్తామన్నారు.

డబ్ల్యూసీఆర్ జిల్లా చైర్మన్‌గా మహ్మద్ అమ్రోజ్

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 13 : వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ (డబ్ల్యూసీఆర్) వ్యవస్థాపకులు జాతీయ చైర్మన్ నలమాస శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని రాధా కన్వెన్షన్ హాల్‌లో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. జిల్లా చైర్మన్‌గా మమ్మద్ అమ్రోజ్, డిప్యూటీ చైర్మన్లుగా కానుగుల రాకేశ్, వెల్దండి నరేశ్, థయిసిన్ బేగం, వైస్ చైర్మన్లుగా కసిరెడ్డి రణదీప్‌రెడ్డి, పెండ్యాల అమరేందర్‌రెడ్డి, సెక్రటరీలుగా కాకర్ల అభిలాష్ గౌడ్, గట్టు పద్మ, లీగల్ ఇన్‌చార్జిగా అజ్మీరా అనిల్ సాయితేజ, పీఆర్వోగా కసిరెడ్డి నితిశ్‌రెడ్డిని ఎంపిక చేశారు.

కాజీపేట రాణాను తనిఖీ చేసిన సీపీ

కాజీపేట, ఫిబ్రవరి 13 : వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా కాజీపేట పోలీస్ స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. లాకప్, సీసీ కెమెరా సిస్టం రూం, సిబ్బంది రూంను పరిశీలించారు. రిసెప్షన్ సిబ్బంది పని తీరు, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సీఐ సుధాకర్‌రెడ్డిని అడిగారు.

సిబ్బంది పనితీరుపై ఆరా తీస్తున్న సీపీ

15 నుంచి ఉచిత శిక్షణ తరగతులు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 13 : ఈ నెల 15వ తేదీ నుంచి ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎంపీవీ ప్రసాద్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 14 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ముగుస్తుందని, వివరాలకు 0870-2571192లో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, ఫిబ్రవరి 13 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమిడి సబ్ స్టేషన్ పరిధిలోని విష్ణుపురి, జూబ్లీమార్కెట్, సుబ్బయ్యపల్లి, సోమిడి ఏరియాల్లో ఉదయం 11నుంచి 11:30 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

స్కూటీలు ఎక్కడ ప్రియాంక?

పోస్ట్‌కార్డు ద్వారా నిరసన తెలిపిన విద్యార్థినులు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 13 : యూత్ డిక్లరేషన్ పేరుతో 18 ఏళ్లు నిండిన విద్యార్థినులకు ఉచితంగా స్కూటీలు అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీని నిలదీస్తూ పోస్టుకార్డు ఉద్యమం ద్వారా విద్యార్థినులు నిరసన తెలిపారు. హనుమకొండలోని ఆర్ట్స్ డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థినులు 500 మంది గురువారం 'ప్రియాంక జీ.. వేర్ ఈజ్ మై స్కూటీ' అనే నినాదంతో పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. పోస్టు కార్డుల్లో 'తెలంగాణలోని యువ విద్యార్థినులకు కాంగ్రెస్ పార్టీ ఉచిత స్కూటీ హామీ ఇచ్చింది. ఇప్పుడు ఎన్నికలు పూర్తయి ఏడాది గడుస్తున్నా మాకు వాహనాలు ఇవ్వలేదు. మీరిచ్చిన హామీ విస్మరించారా?' అంటూ రాసిన పోస్ట్‌కార్డును ప్రియాంక గాంధీ చిరునామాకు పంపించారు.

స్కూటీ హామీపై ప్రియాంకగాంధీకి పోస్టుకార్డులు పంపిస్తున్న హనుమకొండలోని ఆర్ట్స్ డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థినులు

కడియం చేసిన అభివృద్ధి శూన్యం

- గత ప్రభుత్వ హయాంలోనే ఘన్‌పూర్ నియోజకవర్గం అభివృద్ధి
- బీఆర్ఎస్ మండల నాయకులు

వేలేరు, ఫిబ్రవరి 13 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేశారని, కడియం శ్రీహరి చేసింది శూన్యమని పార్టీ మండల ఇన్‌చార్జి ఇట్టబోయిన భూపతిరాజ్ విమర్శించారు. గురువారం వేలేరులో ఆయన మాట్లాడుతూ.. ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కడియం శ్రీహరి సుమారు రూ.700కోట్లు మంజూరు చేయించారని కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో జరిగిన అభివృద్ధిని చూసే బీఆర్ఎస్ బీఫామ్‌పై పోటీ చేసిన కడియం శ్రీహరిని గెలిపించారన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితోనే వేలేరు మండల అభివృద్ధి జరిగిందనే విషయం ప్రజలందరికీ తెలుసు అని అన్నారు. మాజీ వైస్ ఎంపీపీ సంపత్, మండల కో ఆర్డినేటర్ గొవింద సురేశ్, అధికార ప్రతినిధి రాజు, మాజీ కో ఆప్షన్ మెంబర జానీ, నియోజకవర్గ ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ కొయ్యడ మహేందర్ పాల్గొన్నారు.

వేలేరులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సుందరం హోమ్
నమోదిత కార్యాలయం: నెం. 21, పటుల్లాస్ రోడ్, చెన్నై-600 002.
కార్పొరేట్ కార్యాలయం: సుందరం టవర్స్, నెం. 46, వైట్స్ రోడ్, చెన్నై-600 014.
శాఖ కార్యాలయం: 1వ అంతస్తు, ''కందకట్ల గేట్‌వే'', కెయుసి క్రాస్ రోడ్, నయీమ్‌నగర్, హన్మకొండ, వరంగల్-506009, ఫోన్ నెం. 0870-2441244.

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1) మరియు అనుబంధం IVతో చదువబడే సెక్షన్ 13(4) క్రింద జారీ చేయబడినది సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (SARFAESI) యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతకు డిమాండ్ నోటీసులు జారీచేసి, సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా డిమాండ్ నోటీసులలో తెలిపిన బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిందిగా కోరుతున్నారు. రుణగ్రహీత(లు) బకాయి మొత్తాన్ని పూర్తిగా తిరిగి చెల్లించుటలో విఫలం కావడం చేత, SARFAESI యాక్ట్‌లోని రూల్ 8తో చదవబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి అధీకృత అధికారి దిగువ వివరించబడిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లో సబ-సెక్షన్ (8) నిబంధన గమనించవలసిందిగా రుణగ్రహీతకు తెలియజేయడమైనది. సదరు ఆస్తితో ఏవిధమైన లావాదేవీ నిర్వహించరాదని మరియు సదరు ఆస్తితో నిర్వహించబడు ఏవేని లావాదేవీలు వాస్తవ చెల్లింపు తేదీ వరకు తదుపరి వడ్డీ, వ్యయం మరియు ఇతర చార్జీలు మొ.గు ఏవైనా వాటితోపాటు దిగువ తెలిపిన మొత్తం కొరకు **సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** చార్జ్‌కు లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

| క్ర.సం. | ఫైల్ నం.లు | రుణగ్రహీత & సహ-రుణగ్రహీతల